సాక్షి ప్రకాశం


సోమవారం । 26 । ఆగస్టు । 2024



అక్కడ వృథా.. ఇక్కడ వ్యథ

ప్రాజెక్టుల్లో నిండుగా నీరున్నా జిల్లా సాగునీటి అవసరాలకు నీళ్లు ఇవ్వడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో..



ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యం

సాగర్ కాలువలో ఈతకు వెళ్లి గల్లంతైన ముగ్గురు యువకుల్లో మిగిలిన ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి.

- 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.9/28

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

మార్కాపురం సబ్‌కలెక్టర్‌గా త్రివినాగ్



మార్కాపురం: మార్కాపురం సబ్ కలెక్టర్ గా సహదిత్ వెంకట్ త్రివినాగ్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన రాహుల్ మీనా కాకినాడ జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. త్రివినాగ్ ను మార్కాపురం సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. విజయనగరం ట్రైనీ కలెక్టర్‌గా ఇప్పటి వరకు ఆయన శిక్షణ పొందారు. హైదరాబాద్ ఐఐటీలో 2020లో బీటెక్ పూర్తి చేసి 2022 సివిల్ సర్వీసెస్ అధికారిగా నియమితులయ్యారు.

నేడు కలెక్టర్ గ్రీవెన్స్ రద్దు

ఒంగోలు అర్బన్: ప్రతి సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రకాశం భవనంలో నిర్వహించే మీకోసం గ్రీవెన్స్ కార్యక్రమం నేడు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. కృష్ణాష్టమి పండుగ నేపథ్యంలో పబ్లిక్ హాలిడే కావడంతో గ్రీవెన్స్ రద్దు చేస్తున్నామని ప్రజలు గమనించి కలెక్టర్ కార్యాలయానికి రావద్దని కోరారు.

నేటి నుంచి క్రీడా సంబరాలు

ఒంగోలు: స్థానిక మినీ స్టేడియంలో ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి డి.రాజరాజేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ స్థానిక మినీ స్టేడియంతోపాటు నవోదయ విద్యాలయ సమితిలో నిర్వహిస్తారన్నారు. 27 నుంచి 31వ తేదీ వరకు పవర్‌లిఫ్టింగ్, బాక్సింగ్, సెపక్‌తక్రా, వాలీబాల్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, ఆర్చరీ క్రీడాపోటీలు జరుగుతాయన్నారు. జాతీయ క్రీడా దినోత్సవమైన ఈనెల 29న కలెక్టర్ చేతులమీదుగా బహుమతుల ప్రదానోత్సవం, ప్రశంసపత్రాలు అందజేస్తారని చెప్పారు. అంతే కాకుండా వాకర్స్, ఎంప్లాయిస్‌కు కూడా ఈనెల 30,31 తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.

డేవిడ్‌రాజు మృతి తీరని లోటు

● మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్మన్ పాలపర్తి డేవిడ్‌రాజు మరణం తీరని లోటు అని ఎస్సీసెల్ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. డేవిడ్‌రాజు హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలుసుకొని అమెరికాలో ఉన్న సుధాకర్‌బాబు 'సాక్షి'తో మాట్లాడారు. డేవిడ్‌రాజు సంతనూతలపాడు, యర్రగొండపాలెం నియోజకవర్గాలకు ఎమ్మెల్యేగాను, ప్రకాశం జిల్లాకు జిల్లాపరిషత్ చైర్మన్‌గాను చేసిన అభివృద్ధి మరువలేనిదని ఈ సందర్భంగా టీజేఆర్ గుర్తు చేశారు. ఆయన లేని లోటును తీర్చలేనిదని నివాళులర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తున్నట్లు టీజేఆర్ తెలిపారు.

వ్యవసాయ రంగ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

● వ్యవసాయకార్మిక సంఘ నేత జాలా అంజయ్య పిలుపు



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నేత జాలా అంజయ్య

ఒంగోలు సెంట్రల్: పాలకుల విధానంతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతోందని దాని పరిరక్షణకు విశాల ఐక్య ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నేత జాలా అంజయ్య అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం ఈనెల 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు ఒంగోలులో జరగనున్నాయి. ఈ సభల ఏర్పాటు కోసం సన్నాహక సమావేశం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల అంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అంజయ్య మాట్లాడుతూ నేటికీ 65 శాతం ప్రజలు వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారని, ఆ రంగానికి పాలకులు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని అన్నారు. ఒంగోలులోని కాపు కల్యాణ మండపంలో జరిగే విస్తృత స్థాయి సమావేశంలో దీని కోసం ఒక ప్రణాళిక రూపొందించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ విజయ రాఘవన్ ఈ సభలను ప్రారంభిస్తారని 26 జిల్లాల నుంచి 250 మంది ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు సయ్యద్ హనీఫ్, జీవి కొండారెడ్డి, జీ శ్రీనివాసులు, జీ రమేష్, రఘురాం, తిరుపతి రావు, సీహెచ్ జయ ప్రకాశ్, ఉమా మహేశ్వరి, ఎస్కే హుస్సేన్, మహేష్, వినోద్, వీరా స్వామి పాల్గొన్నారు.



ఆదివారం వస్తే మరీ ఇబ్బంది

"సాధారణ రోజులకంటే ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో వైద్యశాల వద్ద పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుంది. జీజీహెచ్, యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల వద్దకు చికిత్స కోసం వచ్చేవారిలో ఎక్కువగా మద్యం తాగిన వాళ్లే ఉంటున్నారు. ఇలాంటి సందర్భం వచ్చినప్పుడు మహిళా వైద్యులు భయాందోళనకు గురవుతున్నారు. హాస్పిటల్ ఆవరణలో సురక్షిత వాతావరణం నెలకొల్పాలని కోరుకుంటున్నాను. డాక్టర్ల మీద దాడులు చేస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి."

– డా.రంగకుమార్ యాదవ్, మెడికల్ ఆఫీసర్, పాపా కాలనీ యూపీహెచ్, ఒంగోలు



వైద్యులకు మరింత భద్రత కల్పించాలి

"వైద్యులకు పనిచేసే వైద్యశాలల వద్ద మరింత భద్రత ప్రభుత్వం కల్పించాలి. అప్పుడే వారు ఒత్తిడి లేకుండా వైద్యం చేయగలుగుతారు. వైద్యశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. పెద్ద వైద్యశాలల వద్ద పోలీసు కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలి. కోల్‌కత్తా జూనియర్ వైద్యురాలి హత్యాచారం దోషులకు కఠిన శిక్ష విధించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చట్టాలు తీసుకునిరావాలి. రాత్రిపూట పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలి."

– డాక్టర్ కె.రాహుల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు



● జ్వరాల పంజా..

ప్రజారోగ్యం పడకేసి..

జిల్లాలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. గ్రామాల్లో అపరిశుభ్రతతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల పోటు, కలుషిత జలాలతో వ్యాధులు ప్రబలుతున్నాయి. డెంగీ, మలేరియా, విషజ్వరాలతో నిత్యం వందలాది మంది ఆస్పత్రులకు వస్తున్నారు. నల్లమలలోని గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా విషజ్వరాలు, డెంగీ కేసులు ఉన్నాయి. వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. జ్వరాల నియంత్రణలో యంత్రాంగం విఫలమైంది.



హెచ్‌ఎంపాడు మండలం వేములపాడులో ఆర్‌ఎంపీ డాక్టర్ వద్ద గదిలో చోటు లేక చెట్ల కింద సెలైన్ కట్టిన రోగులు

- జిల్లాలో అధ్వానంగా పారిశుధ్యం
- నానాటికీ పెరుగుతున్న డెంగీ, విషజ్వరాల కేసులు
- ప్రభుత్వాస్పత్రుల్లో కేసులే లెక్కలోకి..
- గత నెలలో 20 డెంగీ కేసులు, ఈ నెల 24 వరకు 25 కేసులు
- టైఫాయిడ్ కేసులు 800, వైరల్ జ్వరాల కేసులు 1100
- ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్‌ఎంపీల వద్ద లెక్కలోకి రాని వందలాది కేసులు
- పారిశుధ్య చర్యలు, జ్వరాల నియంత్రణలో యంత్రాంగం విఫలం

ఒంగోలు అర్బన్: పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టడం, దోమల వృద్ధిని అడ్డుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దీంతో జిల్లాలో పారిశుధ్యం పడకేసింది. ఒక వైపు వైద్య ఆరోగ్య శాఖ, మరోవైపు పంచాయతీ, మున్సిపల్ శాఖల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. రోజురోజుకూ దోమల బెడద పెరిగిపోయి డెంగీ, మలేరియాతో పాటు అనేక రకాల వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ, ఇతర విష జ్వరాలతో బాధితులు క్యూ కడుతున్నారు. ఇప్పటికి డెంగీతో మృతిచెందిన కేసు ఒకటే ఉన్నట్లు ప్రభుత్వ యంత్రాంగం చూపుతున్నా అది కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల లెక్క మాత్రమే.

లెక్కలోకి రాని కేసులు వేలల్లో...

మే నెలలో 10 డెంగీ కేసులు నమోదైతే జూన్‌లో 11, జూలైలో 20 కేసులు, ఈ నెలలో 25 కేసులు నమోదయ్యాయి. మలేరియా, డెంగీ కేసులు ఎక్కువగా చీమకుర్తి, పొదిలి, దర్శి ప్రాంతాల్లో నమోదవుతున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా ఈ నెలలో టైఫాయిడ్ కేసులు 800, వైరల్ జ్వరాలు 1100 నమోదయ్యాయి. ఇవి కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన జ్వరాల సంఖ్య మాత్రమే. ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్న డెంగీ కేసులు, ఇతర విష జ్వరాల కేసులు కూడా నమోదు చేస్తే ఆ సంఖ్య వేలల్లో ఉంటాయి. ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్‌ఎంపీల వద్ద వందల సంఖ్యలో డెంగీ బాధితులు చికిత్స పొందుతున్నా వాటిపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. కనీసం ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎన్ని కేసులు నమోదవుతున్నాయో కూడా వైద్య ఆరోగ్య శాఖ తెలుసుకోవడం లేదంటే ప్రజా ఆరోగ్యం పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది. కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల్లోవే లెక్కేసుకుని పెద్దగా జ్వరాల కేసులు లేవనే భ్రమలో ఉండటమే కాకుండా రికార్డుల్లో తక్కువ సంఖ్యనే చూపుతున్నారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాల కేసులు ప్రైవేటు ఆస్పత్రులు సంబంధిత ప్రభుత్వ శాఖలకు తెలపాలి. అయితే ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ఇటువంటి నిబంధనలు పాటించకుండా సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు.

డెంగీతో బాలుడు మృతి

గిద్దలూరు నియోజకవర్గంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలకు జ్వర బాధితులు క్యూకడుతున్నారు. బేస్తవారిపేట మండలంలోని జెన్నివారిపల్లెలో ఆరేళ్ల బాలిక పంతగాని హెప్సిబా డెంగీ బారిన పడి నంద్యాలలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స తీసుకుంది. కంభంలోని అమ్మవారిశాల వీధికి చెందిన ఆలంపల్లి భరద్వాజ్ 14 ఏళ్ల బాలుడు ఈనెల 3వ తేదీన డెంగీ జ్వరంతో మృతిచెందాడు. కందులాపురంలో మహానందిరెడ్డి డెంగీ బారినపడి గుంటూరు ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సపొందాడు.

నల్లమలలో ప్రబలుతున్న విష జ్వరాలు

నల్లమల అటవీ ప్రాంతంలోని గిరిజన గూడెం, తండాలు విషజ్వరాలతో వణికి పోతున్నాయి. తగిన సమయంలో వైద్యం సక్రమంగా అందక



సింగరాయకొండ-కందుకూరు రోడ్డులో రోడ్డు పక్క నిల్వ ఉన్న చెత్త

పెద్దదోర్నాల, పుల్లలచెరువు, యర్రగొండపాలెం ప్రాంతాల్లోని గిరిజనులు అల్లాడిపోతున్నారు. 10 రోజులుగా పరిస్థితి ఇదే విధంగా కొనసాగుతోంది. యర్రగొండపాలెం మండలంలోని పాలుట్ల గిరిజన పంచాయతీ పరిధిలో వైద్య సిబ్బంది వైద్యం అందిస్తున్నా జ్వరాల ఉధృతి అదుపుకావడంలేదు. స్థానిక ఏరియా వైద్యశాలలో రోజుకు 50 మంది వరకు జ్వరాలతో బాధపడే రోగులు వస్తున్నారని ఒక వైద్యాధికారి తెలిపారు. ప్రైవేటు వైద్యశాలల్లో ఎక్కువ మంది చికిత్స పొందుతున్నారు.

మార్కాపురం జీజీహెచ్‌లో అధ్వానంగా పారిశుధ్యం:
మార్కాపురం పట్టణంతోపాటు శివార్లలో ఉన్న సర్వజన వైద్యశాలలో (జీజీహెచ్‌లో) పారిశుధ్యం అధ్వానంగా మారింది. వర్షం కురిస్తే వైద్యశాలలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వర్షపునీరు గుంతల్లో ఉండటంతో బురదగా మారి దోమల వ్యాప్తికి కారణమవుతోంది. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సిస్టమ్ లేకపోవడంతో వైద్యశాలలో ఉండే చెత్తా చెదారమంతా పేరుకుపోతోంది. రోగులు, సహాయకులు కూర్చునేందుకు ఏర్పాటుచేసే బెంచీల వద్ద మురుగునీరు నిలిచి దోమల వ్యాప్తికి కారణమవుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకొని అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మార్కాపురం పట్టణంలో కూడా పలువురు వైరల్ జ్వరాలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు.

☛ కొండపి నియోజకవర్గం సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు డెంగీ, టైఫాయిడ్, మలేరియా, ఫ్లూజ్వరాలు ప్రబలుతున్నాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి జ్వరాలతో రోజూ 30 మంది వరకు వస్తున్నారని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఇటీవల కాలంలో మూలగుంటపాడు, బైరాగిమాన్యం, బాలయోగి



మార్కాపురం జీజీహెచ్ ప్రాంగణంలో పందుల సంచారం

నగర్, కనుమళ్ల పంచాయతీ చిన్న కనుమళ్ల బీసీ కాలనీ, పాతసింగరాయకొండ పంచాయతీ కార్యాలయం సమీపంలో ప్రజలు డెంగీ బారిన పడి చికిత్స పొందారు.

☛ కనిగిరి నియోజకవర్గం హనుమంతునిపాడు మండలాల్లో విషజ్వరాలు ప్రబలుతుండటంతో స్థానిక ఆర్‌ఎంపీలను ఆశ్రయించి చికిత్స పొందుతున్నారు. జ్వరపీడితులు ఎక్కువ కావడంతో చెట్ల కింద మంచాలు వేసి ఇద్దరు ముగ్గురిని ఉంచి సెలైన్‌లు ఎక్కిస్తున్నారు. ప్రతి సచివాలయ పరిధిలో హెల్త్ క్లినిక్ ఉన్నా.. ఆరోగ్య సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం అయితే హెల్త్ క్లినిక్‌లు మూతవేస్తున్నారు. ఏఎన్‌ఎంలు మధ్యాహ్నం 12 గంటలు దాటితే గ్రామాల్లో కనిపించడం లేదు.



ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

డెంగీ పేరుతో దోపిడీ..

ఎలీసా పరీక్షల ద్వారా డెంగీ నిర్ధారణ చేస్తారు. అయితే ప్రైవేటు ఆస్పత్రుల్లో రాపిడ్ టెస్ట్ ద్వారా డెంగీని నిర్ధారించి ట్రీట్‌మెంట్ ఇస్తూ ప్రజల నుంచి లక్షలు దోచేస్తున్నారు. అయినా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం ప్రైవేటు ఆస్పత్రులపై ఏ చర్యలు తీసుకోకుండా వారి వ్యాపారానికి పరోక్షంగా సహకరిస్తున్నారు. మొత్తం మీద ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందనే తేటతెల్లం. ఇప్పటికైనా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఇతర వైరల్ జ్వరాల పట్ల ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసులను తెలుసుకుని తగిన చర్యలు తీసుకుని జ్వరాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఒంగోలు బలరాంకాలనీ వద్ద రోడ్డు పక్కన చెత్త నిల్వ



ఒంగోలు రాజీవ్‌కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో నివాసాల మధ్య ఖాళీ స్థలంలో నిలిచిన మురుగునీరు

మహిళలు లక్షాధికారులు కావాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలంతా ఆర్థికంగా బలపడి లక్షాధికారులు కావాలని అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. లఖ్‌పతి దీదీ పథకం ద్వారా సంఘాల్లోని మహిళలకు అవసరమైన సహాయ, సహకారాలు ప్రభుత్వం నుంచి అందజేస్తున్నామన్నారు. ఆదివారం మహారాష్ట్ర లోని జల్‌గావ్‌లో నిర్వహించిన లఖ్‌పతి దీదీ సమ్మేళనంలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని స్వయం సహాయక సంఘాల మహిళలతో ముచ్చటించారు. దీనికి అనుసంధానంగా ప్రకాశం భవనం నుంచి వీడియో సమావేశంలో కలెక్టర్, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. దీనిలో ఈ పథకం లక్ష్యాలను కలెక్టర్ మహిళలకు వివరించారు. స్వయం ఉపాధి కోసం వివిధ యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా బ్యాంకు లింకేజీ, కమ్యూనిటీ ఇన్వెస్టిమెంట్ ఫండ్స్, స్త్రీనిధి, ఉన్నతి, రివాల్వింగ్ ఫండ్, కమ్యూనిటీ ఎంటర్ ప్రైజ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. జిల్లాలో మొత్తం 45,421 స్వయం సహాయ సంఘాలు ఉన్నాయని వాటిలో 4,57,453 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. వచ్చే వంద రోజుల్లో లఖ్‌పతి దీదీలుగా మారే అవకాశం ఉన్న వారికి ప్రశంస పత్రాలతో పాటు రూ.88.80 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కులను కలెక్టర్ అందజేశారు. దీనిలో డీఆర్‌డీఏ పీడీ వసుంధర, డీపీఎంలు డేవిడ్, సుబ్బారావు, కృపారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్వయం సహాయక సంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పరపతి ఉంటేనే పోస్టుమార్టం

- గ్రానైట్ వ్యాపారి దేవేందర్ సింగ్ మృతదేహం పోస్టుమార్టం విషయంలో మీన మేషాలు
- స్పందించిన బీజేపీ శాఖ, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్, రాజస్థాన్ డిప్యూటీ సీఎం
- ఎట్టకేలకు పోస్టుమార్టం

ఒంగోలు సెంట్రల్: పరపతి ఉంటేనే పోస్టుమార్టం కూడా పూర్తవుతుందని ఒంగోలు రిమ్స్‌లో ఆదివారం జరిగిన సంఘటన రుజువు చేసింది. చీమకుర్తిలో రాజస్థాన్‌కు చెందిన గ్రానైట్ వ్యాపారి దేవేందర్ సింగ్ గుండెపోటుతో శనివారం మరణించారు. ఆయన మృతదేహాన్ని రాజస్థాన్ తీసుకెళ్లేందుకు పోస్టుమార్టం రిపోర్ట్ కీలకమవుతుందని భావించిన బంధుమిత్రులు విషయాన్ని చీమకుర్తి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వారు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అయితే పోస్టుమార్టం ఇక్కడ కుదరదని, చీమకుర్తి తీసుకెళ్లాలని రిమ్స్ సిబ్బంది తెలిపారు.



మృతదేహం కోసం వేచిచూస్తున్న దేవేందర్ సింగ్ బంధువులు, బీజేపీ శ్రేణులు

మృతదేహం పాడవుతుందని ఆందోళన చెందిన బంధువులు విషయాన్ని బీజేపీ నార్త్ ఇండియా సెల్ కన్వీనర్ విజయ్ మోదీ దృష్టికి బంధు మిత్రులు తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి స్థానిక ఒంగోలు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్ దృష్టికి తీసుకు రాగా ఆయన వివిధ మార్గాల ద్వారా రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రికి, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టికి, రిమ్స్ డైరెక్టర్ నామినేని కిరణ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వారు రిమ్స్ అధికారులపై ఒత్తిడి పెంచటంతో ఎట్టకేలకు రెండు గంటల్లో పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మారిన జీవశాస్త్రం సబ్జెక్టుపై అవగాహన

ఒంగోలు: మారిన పదో తరగతి జీవ శాస్త్రం సబ్జెక్టుపై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం ఆదివారం స్థానిక స్పందన భవన్‌లో నిర్వహించారు. ఏపీ బయాలజీ సబ్జెక్టు టీచర్ల ఫోరం ప్రకాశం జిల్లా శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రిసోర్సు పర్సన్లుగా ఎస్‌సీఈఆర్‌టీ, జిల్లాకు చెందిన పలువురు రిసోర్సు పర్సన్లు, పదో తరగతి జీవశాస్త్రం పుస్తక రచయితలు పాల్గొని ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా గతంలో ఉన్న జీవ శాస్త్రం పుస్తకానికి, ప్రస్తుతం మారిన జీవ శాస్త్రం పుస్తకానికి మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి, మారిన పుస్తకానికి అనుగుణంగా ఉపాధ్యాయుడు ఎలా దానిని అవగాహన చేసుకోవాలి, అందుకు తగ్గ ప్రణాళిక రూపొందించుకోవడం గురించి వివరించారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో వెయ్యి సీబీఎస్ఈ పాఠశాలలు ఉన్నాయని, ఆ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సీబీఎస్ఈ బోర్డు అందించే ప్రశ్నాపత్రం ఎలా ఉంటుంది, దానికి అనుగుణంగా విద్యార్థులను ప్రిపేర్ చేయడం ఎలా అనే అంశంపై వివరించారు. ఎస్‌బీఎస్ఈ కాని మిగతా పాఠశాలల్లో డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ ప్రశ్నాపత్రం రూపొందిస్తుందని, ఈ నేపథ్యంలో వీరు పాత పద్ధతి ప్రకారం మారిన సబ్జెక్టుపై ఎలా విద్యార్థులను సన్నద్ధం చేయాలనే దానిపై వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందని ఏపీ బయాలజీ సబ్జెక్టు టీచర్ల ఫోరం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు సూర్యనారాయణ, సీహెచ్ మురళి, గేరా నివేదిత, ధనలక్ష్మి, సరోజులు పేర్కొన్నారు. అనంతరం అవగాహన కల్పించిన ఎస్‌సీఈఆర్‌టీ ప్రతినిధులు, పుస్తక రచయితలు, రిసోర్సు పర్సన్లు అయిన సీహెచ్ వీరప్పయ్య, షేక్ మొహమ్మద్ గౌస్, జాకీర్ అహ్మద్ తదితరులను ఘనంగా సత్కరించారు.



అవగాహన కల్పించిన వారిని సత్కరిస్తున్న ఏపీ బయాలజీ సబ్జెక్టు టీచర్ల ఫోరం ప్రతినిధులు

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక

చీమకుర్తి: జిల్లా తరఫున రాష్ట్రస్థాయిలో పాల్గొనే సబ్‌జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు ప్రాంగణంలో ఆదివారం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. వచ్చే నెల 13, 14, 15 తేదీల్లో అన్నవరంలో నిర్వహించే పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున ఈ జట్టు పాల్గొంటుంది.



బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

క్లుప్తంగా

బతుకు వేటలో విగతజీవిగా..

● సముద్రంలో బోటు నుంచి జారిపడి మత్స్యకారుడు మృతి


లింగయ్య మృతదేహం

కొత్తపట్నం: సముద్రంలో వేటకు వెళ్లి ఓ మత్స్యకారుడు మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన మడనూరుడు గ్రామం పెద్దపట్టపుపాలెం సముద్రం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపట్నం మండలం మడనూరు గ్రామం పెద్దపట్టపుపాలేనికి చెందిన పొన్నపూడి లింగయ్య(44) ఈ నెల 24 సాయంత్రం 5 గంటలకు రోజూమాదిరిగానే సముద్రంలో వేటకు వెళ్లాడు. వేట సాగిస్తున్న సమయంలో ప్రమాదశావత్తు కాలు జారి సముద్రంలో పడిపోయాడు. బోటులో ఉన్న తోటి మత్స్యకారులు గాలించినా ఆయన ఆచూకీ కనిపించలేదు. దీంతో మృతుడు భార్య పొన్నపూడి మస్తానమ్మ ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం వైష్ణవి హేచరీ ఎదురుగా సముద్రం ఒడ్డున లింగయ్య మృతదేహం కనిపించడంతో స్థానిక మత్స్యకారులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై వేముల సుధాకర్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

పాల దుకాణంలో చోరీ

● రూ.1.33 లక్షల నగదు అపహరణ


చోరీ జరిగిన పాల దుకాణం

టంగుటూరు: టంగుటూరులోని పాల దుకాణంలో దొంగలు పడి నగదు అపహరించిన ఘటన శుక్రవారం చోటుచేసుకోగా ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు.. టంగుటూరు సెంటర్‌లోని సింగరాయకొండ రోడ్డులో భ్రమరాంబ మల్లికార్జున పాల దుకాణంలో రోజులాగే పాల విక్రయాలు పూర్తయ్యాక, రెండు రోజుల కలెక్షన్ నగదు రూ.1.33 లక్షలను కౌంటర్‌లోనే ఉంచి ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం వచ్చి చూసే సరికి దుకాణం షట్టర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దుకాణంలో ఉన్న వస్తువులు చెల్లా చెదురుగా పడి ఉండటం, రూ.1.33 లక్షల నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు యజమాని ప్రియాంక వెంకారెడ్డి తెలిపారు. దేవుడి వద్ద చిల్లర కూడా వదల లేదని, నగదు దాచిపెట్టడాన్ని గమనించి తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉంటారని ఆమె అనుమానం వ్యక్తం చేశారు.

అడవిని అమ్మేశారు!

● ఆమ్యామ్యాల మత్తులో అధికారులు
● 'సంపద సృష్టి'లో రెచ్చిపోతున్న పచ్చ నేతలు


అటవీ కర్ర తరలింపును అడ్డుకుంటున్న గ్రామస్తులు

పీసీపల్లి: అటవీ ప్రాంతంలో వృక్ష సంపదను ఆ శాఖ అధికారులే అక్రమార్కులకు అమ్మేశారు. గ్రామాల్లో సామంత రాజుల్లా వ్యవహరిస్తున్న పచ్చ నేతలు ఒక్కో అటవీ ప్రాంతాన్ని సొంత పార్టీ నాయకులకు అప్పజెప్పి వాటాలు పుచ్చుకుంటుండగా.. అధికారులు మాత్రం మామూళ్లు దండుకుంటున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పీసీ మండల పరిధిలోని గుంటూరు లింగన్నపాలెం, అడవిలోపల్లి, పిల్లివారిపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు బహిరంగంగానే అటవీ కర్రను అక్రమంగా కొట్టి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అమ్యామ్యాలు పుచ్చుకుంటూ చోద్యం చూస్తున్నారు. గుంటూరు లింగన్నపాలెంలో ఈ నెల 1 నుండి 22వ తేదీ వరకు మాలకొండకు చెందిన ఓ వ్యక్తికి కర్ర కొట్టుకునేందుకు అనధికారికంగా అనుమతి ఇచ్చారు. అలాగే పీసీపల్లిలో టీడీపీ నాయకులు అండదండలతో అక్రమంగా అటవీ కర్రను తరలిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం పిల్లివారిపల్లి, వెలుతుర్లవారిపల్లి మధ్య ఉండే చెరువులో కర్రను అక్రమంగా తరలిస్తుండగా ఇరు గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. పంచాయతీలకు, ఇరిగేషన్, అటవీ శాఖకు నష్టం కలిగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.


తరలించేందుకు సిద్ధం చేసిన కర్ర

కోల్‌కతా తరహా ఘటనలు పునరావృతం కాకూడదు



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన మృగాలను కఠినంగా శిక్షించాలి. అటువంటి సంఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి. రాత్రింబవళ్లు రోగులకు సేవలు అందించే వైద్యులకు రక్షణ లేకుంటే చిత్తశుద్ధితో పనిచేసే పరిస్థితి ఉండదు. వైద్యులకే కాదు అన్ని శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలి.

– డాక్టర్ శ్యామల, డెంటిస్ట్, ఏరియా వైద్యశాల, యర్రగొండపాలెం



కఠిన చట్టాలు తీసుకురావాలి



మహిళా వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు జరగకుండా ఉండాలంటే ప్రభుత్వం చట్టాలను కఠినతరం చేయాలి. దాడులకు పాల్పడిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలి. వైద్యశాలల్లో పని చేసే స్టాఫ్ నర్సులు, వైద్యులు, ఇతర మహిళా సిబ్బంది వారి డ్యూటీల్లో భాగంగా 24 గంటలు వైద్యశాలల్లో విధులు నిర్వహిస్తుంటారు. అటువంటి వారికి రక్షణ ఉంటుందన్న భరోసా ఉంటేనే ధైర్యంగా పనిచేసుకోగలుగుతారు.

– డాక్టర్ డి.పద్మావతి బాయి, గైనకాలజిస్ట్, కంభం


రజానగరం మేజర్ కింద సాగు చేసిన ఎండుముఖం పట్టిన మొక్కజొన్న


పసుపుగల్లు వద్ద గోరుచిక్కుడు పంటను దుక్కి దున్నివేస్తున్న రైతు


చంద్రగిరి వద్ద ఎండిపోయిన కొర్ర పంట


అడుగంటిన సాగర్ కాలువ పరిధిలోని సోమేపల్లి చెరువు

అక్కడ వృథా.. ఇక్కడ వ్యథ

కృష్ణా జలాలతో జలాశయాలు నిండుకుండల్లా ఉన్నాయి. ఎక్కువగా వస్తున్న వరద నీటిని సముద్రం పాలు చేస్తున్నారు. అయినా సాగు అవసరాల కోసం సాగర్ జలాలు విడుదల చేయకపోవడంతో ఆయకట్టు భూములు బీడువారాయి. సాగర్ ఆయకట్టు పరిధిలో చెరువులు, కుంటలు కూడా పూర్తిగా నింపిన దాఖలాలు లేవు. దీంతో గ్రామాల్లో తాగునీటికి కూడా కటకటలాడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేకపోవడంతో సాగునీరివ్వడం లేదని అధికారులు చెబుతున్నారు. దీనిపై సాగర్ ఆయకట్టు రైతాంగం మండిపడుతోంది.

● చినుకు రాలక..పాలకుల కరుణ నోచక రైతుల అగచాట్లు
● ప్రాజెక్టుల్లో నిండుగా నీరు
● అయినా బీడువారిన సాగర్ ఆయకట్టు
● ఖాళీగా దర్శనమిస్తున్న చెరువులు, కుంటలు
● కృష్ణా జలాలు సముద్రం పాలు
● ప్రభుత్వం, ఉన్నతాధికారుల మొద్దునిద్ర
● మండిపడుతున్న అన్నదాతలు

త్రిపురాంతకం/ఒంగోలు సెంట్రల్: ప్రకృతి ప్రతికూలతతో పాటు పాలకుల నిర్లక్ష్యంతో జిల్లా రైతులు విలవిల్లాడుతున్నారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతన్నలు సాగుచేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. జిల్లాలో ముందస్తుగా కురిసిన వర్షాలతో ఖరీఫ్‌లో సాధారణ సాగు 4,99,757 ఎకరాలు ఉండగా, 1,19,755 ఎకరాల్లో పలు పంటలు బోర్ల కింద, వర్షాధారంగా సాగు చేశారు. జూన్, జులై, ఆగస్టు నెలల్లో 238.2 మి.మీలు సాధారణ వర్షపాత నమోదు కావాల్సి ఉండగా 215 మి.మీలు మాత్రమే కురిసింది. దీంతో జిల్లాలో సాగు చేసిన పంటలు పలు చోట్ల ఎండుముఖం పడుతున్నాయి. రాష్ట్రంలోని ధాన్యం ఉత్పత్తికి ప్రధాన నీటి వనరు అయిన నాగార్జున సాగర్ డ్యామ్ కింద జిల్లాలో 4.42 లక్షల ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. 17 ఎత్తిపోతల మళ్లింపు పథకాలు, 180 చెరువుల కింద సేద్యం సాగర్ నీటి ఆధారంగానే జరుగుతుంది. అధికార, అనధికారికంగా 6 లక్షల ఎకరాల దాకా పంటలు పండుతాయి. ప్రస్తుతం సాగర్‌లో 590 అడుగుల మేర 312.04 టీఎంసీల నీరు ఉండటంలో ఎడమ కాలువకు 8,022, కుడికాలువకు 8298 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. కుడికాలువకు వస్తున్న నీటిలో మన జిల్లాకు వస్తున్న నీరు తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. డ్యామ్‌లు నీటితో కళ కళలాడుతుండటంతో తమ నీటి అవసరాలకు ఉపయోగపడతాయని రైతన్నలు ఆశలు పెట్టుకున్నాయి. అయితే సాగునీటి అవసరాలకు తక్షణం విడుదల చేయకపోవటంతో ఎండుతున్న పంటలను చూసిన రైతాంగం తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

సాగర్ పరిధిలోఖాళీగాఉన్న చెరువులు, కుంటలు

నాగార్జున సాగర్ ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు తాగునీటి అవసరాల కోసం గత నెలలో సాగర్ జలాలు విడుదల చేశారు. అప్పట్లో జలాశయం ఖాళీగా ఉండటంతో కేవలం తాగునీటి అవసరాల కోసం ఎస్ఎస్ ట్యాంకులు, తాగునీటి చెరువులు, రామతీర్థం జలాశయం మాత్రమే నింపాలని ప్రధాన కాలువపై ఎన్ఎస్‌పీ సిబ్బంది, రెవిన్యూ, పోలీసులతో మేజర్ల వద్ద గస్తీ ఏర్పాటు చేశారు. అనంతరం పదిహేను రోజులుగా కృష్ణా జలాలు సముద్రం పాలవుతున్నాయి. అయినా సాగు అవసరాలకు ఒక్క చుక్క నీటిని సైతం విడుదల చేయకుండా అడ్డుకుంటున్నారు. దాంతో పశువులకు సైతం తాగునీరు దొరకని పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. ఇంత దారుణంగా గతంలో ఎప్పుడూ జరగలేదు. డ్యాములు నిండితే సాగునీరు, తాగునీరుకు ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయంతో ప్రజానీకం ఉండగా ఉన్నతాధికారులు నీటి సరఫరాపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సాగర్ పరివాహక ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపితే కనీసం ఆ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీరే అవకాశం ఉంది.

నారుమళ్లకు సాగర్ నీరందించరా..

ఖరీఫ్‌లో బీపీటీ రకం సన్నరకాల వరి ధాన్యం రైతులు సాగుచేస్తారు. సన్నరకాల వరి పండించాలంటే ఇప్పటికే నారుమళ్లు పోసుకోవాలి. సాగుకు నీరు వదలాలని సాగర్ అధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్నా ఎలాంటి ప్రయోజనం లేదు. కనీసం సకాలంలో నారుమళ్లు పోసుకునేందుకైనా నీరందించాలని పదేపదే కోరుతున్నా అధికారులు కనికరించడంలేదు. ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం ప్రకటిస్తేనే నీరు విడుదల చేస్తాం లేకుంటే తాము చేయగలిగిందేమీ లేదని వారంటున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఇకనైనా మొద్దు నిద్ర వీడి సాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని అన్నదాతలు కోరుతున్నారు.


కరువది మేజర్‌లో స్వల్పంగా వస్తున్న నీరు

తీవ్రంగా నష్టపోయాను



తీవ్ర వర్షాభావం వలన ఇప్పటికే మొక్కజొన్న ఎండుముఖం పట్టింది, బోర్లలో నీరు సైతం తగ్గుతున్నాయి. 6 ఎకరాలు మొక్కజొన్న సాగు చే ఉ్నాను. రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. కంకి వేసే సమయంలో ఎండిపోంది. రజానగరం మేజర్‌కు దోర్నపు వాగుకు నీరు పెట్టి రైతులను ఆదుకోవాలి. లేదంటే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

– శ్రీనివాస రెడ్డి, చంద్రగిరి, ముండ్లమూరు మండలం

సాగునీటి కోసం ఎదురుచూస్తున్నాం



సాగర్ జలాశయం నిండుతుంటే ఎంతో ఆనందపడ్డాం. ఇప్పటికి రెండుసార్లు సముద్రానికి నీరంతా వృథాగా పోయింది. అయినా అధికారులు మేజర్లకు నీరు విడుదల చేయకుండా బిగించేశారు. ఎప్పుడు నీరిస్తారో తెలియని పరిస్థితి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం అధికారులు వెంటనే నీటిని విడుదల చేస్తే రైతులు నారుమళ్లు పోసుకునే అవకాశం ఉంటుంది. ఐదెకరాల భూమి ఉంది. పైర్లు వేసుకోవాలంటే సాగునీరు విడుదల చేస్తేనే అవకాశం ఉంటుంది. సాగర్ రైతులంతా సాగునీటి విడుదల కోసం చూస్తున్నారు.

– గర్లపాటి యల్లయ్య, రైతు, కంకణాలపల్లి

నీరివ్వడంలో ప్రభుత్వం విఫలం



సాగర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయకపోవడం దారుణం. నెల రోజులుగా కృష్ణా జలాలు సముద్రానికి చేరుతున్నాయి. నాకు రెండెకరాల భూమి ఉంది. సాగర్ కాలువలో నీరు వెళుతున్నా కనీసం చుక్కనీరు అందించకపోవడం చూస్తే రైతులపై ఎంత చిత్తశుద్ధితో అధికారులు పనిచేస్తున్నారో అర్థమవుతుంది. సాగర్ జలాలు ఉన్న రైతులకు సాగునీరు విడుదల చేయడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు.

– దూళ్ల నాగేశ్వరరావు, సాగర్ ఆయకట్టు రైతు, సోమేపల్లి

బోర్లలో నీరు తగ్గటంతో పంటను దున్నేశాను



నాలుగు ఎకరాలు గోరు చిక్కుడు సాగు చేశాను. ఎకరాకు రూ.30 వేలు ఖర్చయింది. నాలుగు ఎకరాలకు రూ.1.20 ఖర్చు చేశా. బోర్లలో నీరు తగ్గడంతో పంట వాడుముఖం పట్టింది. కాపాడటం వల్ల కాదని తెలిసి దున్నేశాను. ఇప్పటికైనా నీరు కాలువలకు అందిస్తే పంటలను కొంత మేర కాపాడుకోవచ్చు.

– మేడగం శ్రీనివాసరెడ్డి, పసుపుగల్లు.

ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యం

● బోటుతో గాలించిన ఎన్డీఆర్ఎఫ్ బృందం
● తీవ్రంగా శ్రమించిన గజ ఈతగాళ్లు
● ఆదివారం సాయంత్రం నీటిపై తేలిన మృతదేహాలు
● కొర్లమడుగు, కొత్తపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో విషాద ఛాయలు


చంద్‌కిరణ్‌రెడ్డి మృతదేహం


మణికంఠారెడ్డి మృతదేహం

దర్శి: సాగర్ కాలువలో ఈతకు వెళ్లి శనివారం గల్లంతైన ముగ్గురు యువకుల్లో మిగిలిన ఇద్దరి మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. శనివారం మధ్యాహ్నం లోకేష్‌రెడ్డి మృతదేహం నీటిపై తేలియాడుతుండగా స్థానికులు బయటకు తీసిన విషయం తెలిసిందే. కాగా కొర్లమడుగు గ్రామానికి చెందిన బత్తుల మణికంఠారెడ్డి, లక్ష్మీపురం గ్రామానికి చెందిన చంద్‌కిరణ్‌రెడ్డి మృతదేహాలు వారు ఈత కోసం దిగిన ప్రాంతంలోనే లభ్యమయ్యాయి. సాగర్ కాలువలో 15 అడుగుల లోతులో పూడికలో కూరుకుపోయిన మృతదేహాలను ఎన్‌డీఆర్ఎఫ్ బృందం గుర్తించింది. గాలింపు చర్యలో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక బోట్‌తో నీటిలో వెతుకుతుండగా ఆదివారం సాయంత్రం 5 గంటలకు మణికంఠారెడ్డి మృతదేహం బయటపడింది. ఆ తర్వాత కాసేపటికి చంద్‌కిరణ్ రెడ్డి మృతదేహం నీటిపై తేలియాడింది. బోట్‌తో కాలువలో కలియదిరుగుతున్న సమయంలో నీటి ఒరవడికి పూడికలో కూరుకుపోయిన మృతదేహాలు పైకి తేలాయి. యువకుల ఆచూకీ కోసం గజ ఈతగాళ్లు తీవ్రంగా శ్రమించారు. గాలింపు చర్యలు కొనసాగుతున్న సమయంలో స్థానిక గ్రామాల ప్రజలు సాగర్ కాలువ వద్దకు భారీగా చేరుకున్నారు. కొర్లమడుగు సర్పంచ్ బత్తుల సుబ్బారెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ బట్టు రాము, స్థానికులు సంఘటనా స్థలంలో గాలిస్తున్న ఈతగాళ్లకు సహాయ సహకారాలు అందించారు. కాగా, తమ కుమారులు బతికి ఉంటారని ఆశించిన తల్లిదండ్రులు.. మృతదేహాలను చూసి తీవ్రంగా కలత చెందారు. చేతి కందివచ్చిన కుమారులు విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రులతోపాటు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు. యువకుల మృతితో కొర్లమడుగు, కొత్తపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.


వల వేసి వెతుకుతున్న గజ ఈతగాళ్లు


సాగర్ కాలువలో బోట్‌తో గాలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

రజకుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

ఒంగోలు సెంట్రల్: స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లవుతున్నా సామాజిక సేవ వృత్తిగా నిర్వహిస్తున్న రజకులపై రాష్ట్రంలో దాడులు, హత్యాచారాలు, హత్యలు, అక్రమ కేసులు, గ్రామ సాంఘిక బహిష్కరణలు పెరిగిపోతున్నాయని ఏపీ రజక వృత్తిదారుల సంఘ ప్రధాన కార్యదర్శి మున్నూరి భాస్కరయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఒంగోలు ప్రజా సంఘాల కార్యాలయంలో టంగుటూరి రాము అధ్యక్షతన వృత్తిదారుల, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రజకుల సామాజిక రక్షణ చట్టం చేయడంతో పాటు 50 ఏళ్లు నిండిన ప్రతి రజకుడికి పెన్షన్ మంజూరు చేయాలని, 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తామన్న హామీలను అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి రాయల మాల కొండయ్య మాట్లాడుతూ.. రజకుల సమస్యలు పరిష్కరించేందుకు పాలకులు చొరవ చూపాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ఆవుల మంద రమణయ్య, డాక్టర్ కృష్ణయ్య, సహాయ కార్యదర్శి చిట్యాల కొండయ్య, సీహెచ్ శ్రీనివాసులు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని చెంతకు.. మార్గం సుగమం


పూర్తయిన తారు రోడ్


రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన అప్పటి మంత్రి సురేష్(ఫైల్)

● పూర్తయిన పృథులగిరి తారు రోడ్డు నిర్మాణ పనులు
● రూ.8.5 కోట్లతో 10.8 కి.మీ మేర రోడ్డు నిర్మాణం
● వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పనులు ప్రారంభం

మర్రిపూడి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పృథులగిరి లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి సాఫీగా చేరుకునే మార్గం అందుబాటులోకి వచ్చింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన తారురోడ్డు నిర్మాణ పనులు ఆదివారంతో పూర్తయ్యాయి. దీంతో మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుల నివేదన ఫలించింది. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి వెళ్లే రహదారి గులకరాళ్లతో అధ్వానంగా మారి భక్తులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మార్కాపురం పర్యటనకు వచ్చిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అప్పటి సీఎం వైఎస్ జగన్ రూ.8.5 కోట్లతో 10.8 కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మించేందుకు ఆర్ఐడీఎఫ్ నిధులు మంజూరు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న మర్రిపూడి వాటర్‌ట్యాంక్ వద్ద రోడ్డు నిర్మాణానికి అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ శంకుస్థాపన చేశారు. రహదారి విస్తరణ పనులు చేపట్టి ఒక లేయర్ మెటల్ సైతం వేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పనులు నిలిచిపోయాయి. ఈ తారురోడ్ మండల కేంద్రమైన మర్రిపూడి వాటర్ ట్యాంక్ నుంచి పృథులగిరి లక్ష్మీనృసింహస్వామి కొండ వరకు అక్కడి నుండి యానాదికాలనీ వరకు వేశారు. రహదారి నిర్మాణానికి కృషి చేసిన అప్పటి మంత్రి ఆదిమూలపు సరేష్‌తోపాటు ఎంపీపీ వాకా వెంకటరెడ్డికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలపై తక్షణమే స్పందించాలి

● బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు బత్తుల పద్మావతి

ఒంగోలు: పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యురాలు బత్తుల పద్మావతి ఆదేశించారు. స్థానిక సమగ్రశిక్ష సమావేశ మందిరంలో జిల్లాలోని కేజీబీవీ, ఏపీ మోడల్ పాఠశాలల నిర్వహణపై సమీక్షించారు. పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ ప్రాసెస్ మెడికల్ ఉండాలన్నారు. విద్యార్థుల పరిస్థితులు, ఆర్ఫాన్స్, సెమీ ఆర్ఫాన్స్ ఎంతమంది ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నిత్యం ఫిర్యాదుల పెట్టె ఉంచాలని, వచ్చిన ఫిర్యాదులపై ప్రిన్సిపాళ్లు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కేజీబీవీ విధానం ప్రకారం 18 రకాల రిజిస్టర్లను తప్పక నిర్వహించాలన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీలు కూడా ప్రతి నెలా సమావేశాలు నిర్వహించాలని, అదే విధంగా విద్యార్థులకు సంబంధించిన అంశాలను కూడా అజెండాలో పొందుపరచాలన్నారు. పిల్లలకు సంబంధించి ప్రహరీ క్లబ్బులు, చిల్డ్రన్స్ కమిటీలను కూడా అన్ని కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో వేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. మోడల్ పాఠశాలలల్లో నెలకు ఒకసారి మండల వైద్య ఆరోగ్యశాఖ అధికారితో వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ఆర్ఫన్స్ ఎవరి ఆధ్వర్యంలో ఉన్నారో మ్యాపింగ్ చేయాలన్నారు. బాలల హక్కులపై నిరంతరం నిఘా ఉంచాలని చెప్పారు. బాల కార్మిక, బాల్య వివాహ రహితంగా జిల్లాను తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో డీఈవో డి.సుభద్ర, జీసీడీవో, సీడబ్ల్యూసీ, డీసీపీఓ, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, డీవైఈవో సుబ్బారావు పాల్గొన్నారు.